# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

శనివారం | 14 జూన్ 2025 | పేజీలు 8




## మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా.. మిక్కిలినేని మను చౌదరి బాధ్యతలు..

### నూతన కలెక్టర్‌కి బాధ్యతలు అప్పగించిన పాత కలెక్టర్ గౌతమ్ పోట్రు..

- స్వాగతం పలికిన అదనపు కలెక్టర్‌లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా..
- కీసరగుట్ట అర్చకులు వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు..
- రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొత్త కలెక్టర్ మను చౌదరి ప్రత్యేక పూజలు..

-2 లో

## ఏఐజీ ఆసుపత్రిలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు

- మాజీ సీఎం కేసీఆర్‌కు ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు
- గచ్చిబౌలిలోని ఆసుపత్రికి వెళ్లిన బీఆర్ఎస్ అధినేత
- డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలు

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాధారణ ఆరోగ్య తనిఖీల్లో భాగంగా ఆయన ఆసుపత్రికి వెళ్లారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో కేసీఆర్‌కు

-3 లో



## మా సామాజికవర్గంలో నేను ఒక్కడినే ఉన్నా... మంత్రి పదవి ఇవ్వండి

- గొల్ల, కుర్మలకు మంత్రి పదవి ఇవ్వాలన్న బీర్ల ఐలయ్య
- పార్టీ, ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యత కల్పించాలని విన్నపం
- గొల్ల, కుర్మల తరఫున తానొక్కడినే ఎమ్మెల్యే అని వ్యాఖ్య




హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో గొల్ల, కుర్మ సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో, పార్టీ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. గొల్లలు, కుర్మలు వేర్వేరు కాదని, వారంతా ఒక్కటేనని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, "తెలంగాణలో గొల్ల, కుర్మలు కలిసి 28 లక్షల మంది ఉన్నారు. వీరిలో గొల్లలు 6 లక్షలు, కుర్మలు 22 లక్షల మంది ఉన్నారు. గతంలో కొందరు గొల్లలు, కుర్మలు వేరంటూ దుష్ప్రచారం చేశారు. కానీ అది వాస్తవం కాదు. ఈ రెండు సామాజిక వర్గాల తరఫున

-3 లో

## ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- 3.64 శాతం డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ
- పెంచిన డీఏ 2023 జనవరి 1 నుంచి వర్తింపు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. ఉద్యోగుల కరవు భత్యాన్ని (డీఏ) 3.64 శాతం పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన ఈ డీఏ 2023 జనవరి 1వ తేదీ నుంచే వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొంతకాలంగా డీఏ పెంపు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా పెంచిన 3.64 శాతం డీఏతో ఉద్యోగుల మూల వేతనంపై అదనపు భత్యం కలవనుంది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ
- వివాదాస్పద భూమిలో ఉన్న సొసైటీ గదిని జేసీబీతో కూల్చివేశారని ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు
- తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన ఒక పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై

-3 లో

- స్వాగతం పలికిన అదనపు కలెక్టర్‌లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా..
- కీసరగుట్ట అర్చకులు వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు..
- రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొత్త కలెక్టర్ మను చౌదరి ప్రత్యేక పూజలు..


కీసరగుట్ట ఆలయ అర్చకులు నూతన కలెక్టర్ మను చౌదరిని ఆశీర్వాదం..

# మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా.... మిక్కిలినేని మను చౌదరి బాధ్యతలు

## నూతన కలెక్టర్‌కి బాధ్యతలు అప్పగించిన పాత కలెక్టర్ గౌతమ్ పోట్రు..


నూతన కలెక్టర్ మను చౌదరి, పాత కలెక్టర్ గౌతమ్ నుంచి బాధ్యతలు స్వీకరణ..


అడిషనల్ కలెక్టర్ లోకల్‌బాడీ రాధికాగుప్తా, నూతన కలెక్టర్‌కి స్వాగతం పలికారు..


కొత్త కలెక్టర్ మను చౌదరికి, మొక్కను అందజేసి స్వాగతం పలికిన మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్..


అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, నూతన కలెక్టర్ మను చౌదరికి పుష్ప గుచ్ఛంతో స్వాగతం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 13:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.. పాత కలెక్టర్ గౌతమ్ పోట్రు నూతన కలెక్టర్ మను చౌదరికి స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు.. తెలంగాణలో 36 మంది కలెక్టర్‌ల బదిలీల నేపథ్యంలో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు గురువారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.. ఈ మేరకు శుక్రవారం మిక్కిలినేని మను చౌదరి మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఛాంబర్‌లో, పాత కలెక్టర్ గౌతమ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.. అంతకు ముందు కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు వేద మంత్రోచ్చారణలతో

పూర్ణకుంభ స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి జిల్లా అదనపు కలెక్టర్‌ల రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డిఓలు, జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మార్వోలు, పుష్పగుచ్చాలు అందచేసి స్వాగతం పలికారు.. పాత కలెక్టర్ గౌతమ్ పోట్రును జిల్లా అధికార యంత్రాంగం సత్కరించి వీడ్కోలు పలికారు..

## తెలంగాణ వ్యాప్తంగా వానలు... హైదరాబాద్‌లో రోడ్లపైకి నీరు, ట్రాఫిక్ కష్టాలు

- తెలంగాణ అంతటా విస్తరించిన నైరుతి రుతుపవనాలు
- రాష్ట్రంలో రాబోయే ఐదు రోజులు వర్ష సూచన
- దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా
- హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో వర్షం, రోడ్లు జలమయం



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా విస్తరించడం తో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ విభాగం శుక్రవారం వెల్లడించింది. వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం, రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో రాష్ట్రంలోని దక్షిణ, పశ్చిమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈరోజు ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ జిల్లాలతో పాటు వికారాబాద్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.మరోవైపు, రుతుపవనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వర్షం కురిసింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు నీటితో నిండిపోయాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## కొమ్మినేనికి సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు

హైదరాబాద్ పెన్ పవర్: ఏపీ రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. కొమ్మినేని బెయిల్ పిటిషన్ కింది కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిపిన జస్టిస్ పీకే మిశ్రా ధర్మాసనం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. మరోసారి అమరావతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయవద్దని కొమ్మినేనికి సుప్రీం ధర్మాసనం సూచించింది. భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కింది కోర్టు విధించిన షరతులకు లోబడే బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. విడుదలకు సంబంధించిన అన్ని నిబంధనలు ట్రయల్ కోర్టు ఇస్తుందని ధర్మాసనం తెలిపింది.

# ఓల్డ్ సిటీ మెట్రో రైల్ పనులపై హైకోర్టు స్టే ఇవ్వలేదు: హైదరాబాద్ మెట్రో




హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ ఓల్డ్ సిటీ మెట్రో పనుల పై క్లారిటీ ఇచ్చారు మెట్రో రైలు ఎండీ. ఎన్ వీ ఎస్ రెడ్డి. పనులు ఆపాలంటూ హైకోర్టు స్టే ఇచ్చిందంటూ వచ్చిన తప్పుడు కథనాల్లో వాస్తవం లేదన్నారు. పలు న్యూస్ పేపర్, న్యూస్ చానల్ లో వచ్చినట్టుగా ఓల్డ్ సిటీ మెట్రో పనులు, మెట్రో రూట్ లో అస్తుల కూల్చి వేతలపై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని స్పష్టం చేశారు. తప్పుదోవ పట్టించేలా వార్తలను ప్రచారం చేశారని చెప్పారు.

**అసలేం జరిగిందంటే.?**

హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్ట్ రెండో దశలో భాగంగా వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమా ప్రాంతాల సమీపంలో ఎలాంటి పనులు చేపట్టరాదంటూ హైకోర్టు జూన్ 12న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని వార్తలు వచ్చాయి. స్టే పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందని ప్రచారం జరిగింది. వారసత్వ కట్టడాల పరిరక్షణపై ఎలాంటి అధ్యయనం లేకుండా వాటి సమీపంలో మెట్రో కారిడార్- 6 పనులు చేపట్టడాన్ని సవాలు చేస్తూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎఫ్) హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకల బెంచ్ జూన్ 12న విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మెట్రో పనుల కారణంగా వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమా సమీపంలోని పలు నిర్మాణాలకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఈ నిర్మాణాల పటిష్టతపై అధ్యయనానికి నిపుణులతో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ వారసత్వ కట్టడాల రక్షణ చట్టం, కేంద్ర పురావస్తు శాఖ చట్ట నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నాకే పనులను కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌లో కౌంటరు దాఖలు చేయడానికి 3 వారాల గడువు కావాలని అదనపు ఏజీ కోరడంతో అనుమతించిన ధర్మాసనం.. అప్పటివరకు చార్మినార్, ఫలక్‌నుమాల సమీపంలో ఎలాంటి పనులను చేపట్టరాదంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో స్పందించిన హైదరాబాద్ మెట్రో..అసలు ఓల్డ్ సిటీ మెట్రో పనులపై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఫేక్ వార్తలను నమ్మొద్దని సూచించింది.

# దమ్ముంటే లై డిటెక్టర్ టెస్టుకు రా: రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

- ఫార్ములా-ఈ కేసులో సోమవారం ఏసీబీ విచారణకు కేటీఆర్
- సీఎం రేవంత్ రెడ్డికి లై డిటెక్టర్ టెస్టుకు రావాలని కేటీఆర్ సవాల్
- న్యాయమూర్తి సమక్షంలో లైవ్‌లో పరీక్షకు సిద్ధమా అని ప్రశ్న
- నల్ల సంచిలో దొరికిన డబ్బుల వ్యవహారంపై సీఎంకు పరోక్ష విమర్శ
- ప్రభుత్వం నడపలేక ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణ అని ఆగ్రహం
- ఫార్ములా-ఈ నిధులు బ్యాంకు ఖాతాలోనే ఉన్నాయని కేటీఆర్ వెల్లడి




హైదరాబాద్ పెన్ పవర్:ఫార్ములా-ఈ కేసులో తనకు ఏసీబీ నుంచి నోటీసులు అందాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దమ్ముంటే ఇద్దరం కలిసి లై డిటెక్టర్ పరీక్షకు హాజరవుదామని సవాల్ విసిరారు. ప్రభుత్వం నడపడం చేతకాక, ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ పార్టీ సర్కస్‌లు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఫార్ములా-ఈ కేసులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాల్సిందిగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తనను ఆదేశించిందని కేటీఆర్ తెలిపారు. ఈ కేసులో రూ. 44 కోట్లు బ్యాంకు నుంచి బ్యాంకుకు బదిలీ అయ్యాయని, ఆ మొత్తం ఫార్ములా-ఈ సంస్థ ఖాతాలోనే భద్రంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా తాను సోమవారం ఏసీబీ అధికారుల ముందు హాజరై, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల క్రితం నల్ల సంచి నిండా డబ్బులతో దొరికిపోయిన వ్యక్తి ఎవరో ఎవరైనా గుర్తు చేయగలరా?" అంటూ పరోక్షంగా ఓటుకు నోటు కేసును ప్రస్తావించారు. "మిస్టర్ రేవంత్ రెడ్డి, మనమిద్దరం ఏసీబీ దర్యాప్తును ఎదుర్కొంటున్నాం కదా. అలాంటప్పుడు ఒక న్యాయమూర్తి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్ష తీసుకుందాం. దానిని టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేద్దాం. తెలంగాణ ప్రజలే ఎవరు దోషో నిర్ణయిస్తారు. నాతో పాటు ఈ పరీక్షకు వచ్చే ధైర్యం మీకుందా?" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రం దివాలా తీసిందని ప్రతిరోజూ చెబుతున్న మీరు, పదేపదే విచారణలు, ప్రచారాలతో ప్రజాధనాన్ని ఎందుకు వృధా చేస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ప్రభుత్వం నడపడం చేతకాకపోతే, ప్రజలను సర్కస్‌లు, ఇతర పరధ్యానాలతో బిజీగా ఉంచుతారు! కాంగ్రెస్, వారి ముఖ్యమంత్రి చేసే విన్యాసాలు మమ్మల్ని నిరోధించలేవు" అని కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఫార్ములా-ఈ లాంటి అంతర్జాతీయ ఈవెంట్ ద్వారా హైదరాబాద్ కీర్తిని పెంచే ప్రయత్నం చేస్తే, దానిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిధులన్నీ పక్కాగా ఖాతాలోనే ఉన్నప్పుడు, ఈ విచారణల పేరిట రాద్ధాంతం ఎందుకని ఆయన నిలదీశారు.

# భార్య అస్థికలు నర్మదానదిలో కలిపేందుకు వచ్చి.. విమాన ప్రమాదంలో ఇండియన్ ఆరిజన్ మృతి





**హైదరాబాద్ పెన్ పవర్:**వారం క్రితమే భార్య చనిపోయింది..పుట్టెడు దుఖంలో ఉన్నాడు..భార్య తీపి జ్ఞాపకాలు ఇంకా చెరిగిపోలేదు..చనిపోతూ భార్య కోరిన కోరికతీర్చాలని ఇండియాకు వచ్చాడు. అనుకున్నది పూర్తి చేశాడు. తిరుగు ప్రయాణం అయ్యాడు. ఇంతలోనే విషాదం..అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో భారతీయ సంతతికి చెందిన అర్జున్ మనుభాయ్ పటోలియా ప్రాణాలో కోల్పోయాడు. వారం వ్యవధిలో తల్లి తండ్రి చనిపోవడంతో ఇద్దరు పిల్లలు అనాధలయ్యారు. 36యేళ్ల అర్జున్ మనుభాయ్ పటోలియా..లండన్ లో స్థిరపడిన ఇండియన్ ఆరిజన్. గురువారం జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో చనిపోయిన 241 మంది ప్రయాణికుల్లో ఒకరు. అతని స్వగ్రామం గుజరాత్?లోని అమ్రేలి జిల్లాలోని వాడియా. గుజరాత్ లోని నర్మదానదిలో తన భార్య అస్థికలు కలిపిందు కు వచ్చి తిరుగు ప్రయాణంలో అర్జున్ మనుభాయ్ పటోలియా ప్రాణాలు కోల్పోయారు.

వారం రోజుల క్రితమే పటోలియా భార్య భారతీబెన్ లండన్ లో చనిపోయింది. భార్య చివరి కోరిక మేరకు ఆమె అస్థికలను నర్మదానదిలో కలిపేందుకు గుజరాత్ కు వచ్చారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత అహ్మదాబాద్ నుంచి ఎయిర్ ఇండియా విమానం AI171 ఎక్కారు. దురదృష్టవశాత్తు గురువారం మధ్యాహ్నం ఎయిర్ ఇండియా విమానం AI171 బోయింగ్ డ్రీమ్ లైనర్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. అర్జున్ పటోలియా మరణంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అర్జున్ పటోలియాకు ఇద్దరు కుమార్తెలు. నాలుగు, ఎనిమిదేళ్ల వయస్సున్న చిన్న పిల్లాలు. వారం వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన వారి ఇద్దరు పిల్లలు అనాధలయ్యారు. గురువారం(జూన్ 12) అహ్మదాబాద్‌లో జరిగిన వినాశకరమైన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 265 మంది మృతిచెందారు. విమానంలో ఉన్న 241 మంది ప్రయాణికులు, 10 మంది ఫ్లైట్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో సహా బీజే కాలేజీ మెడికోలు 24 మంది ఈ ప్రమాదంలో దుర్మరణం చెందారు. చరిత్రలో అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాలలో ఇది ఒకటి.

# విమాన ప్రమాదంతో షాక్ అయ్యా.. ప్రమాదం మా ఇంటి దగ్గర్లోనే జరిగిందన్న నటుడు



**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన ఘటన దేశాన్ని కుదిపేసింది. ఈ ప్రమాదంలో 297 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనపై పలువురు సినీ స్టార్స్ స్పందిస్తూ తమ సానుభూతి తెలుపుతున్నారు. లేటెస్ట్?గా విమాన ప్రమాదంపై మలయాళ హీరో ఉన్ని ముకుందన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. విమానం కూలిపోయిన ప్రాంతానికి సమీపంలోనే తాను పెరిగానని వెల్లడించారు. తన జీవితంలో 24 సంవత్సరాలు అహ్మదాబాద్‌లో గడిపానని, ప్రమాద స్థలానికి కొద్ది దూరంలోనే తమ కుటుంబం ఒకప్పుడు ఉండేదని ఆయన తెలిపారు. ఆ సంఘటన గురించి తెలుసుకుని తాను షాక్‌కు గురయ్యానని ఆయన పంచుకున్నారు. “అహ్మదాబాద్‌లోని మణినగర్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మేఘనినగర్‌లో విమాన ప్రమాదం జరిగిందని నాకు తెలిసింది. నేను 24 సంవత్సరాలుగా మణినగర్‌లో నివసించాను. కేరళ లాగే, గుజరాత్ నాకు అత్యంత ఇష్టమైన రాష్ట్రం. నా బాల్యం మరియు కౌమారదశ అక్కడే గడిపాను. ఈ వార్త నా హృదయంలో తీవ్ర దుఃఖాన్ని కలిగిస్తోంది. నా పాఠశాల స్నేహితులు మరియు నేను షాక్‌లో ఉన్నాము. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా హృదయం విలపిస్తోంది. వారి దుఃఖాన్ని నేను ఊహించగలను. ఈ క్లిష్ట సమయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఆ భగవంతుడు వారికి ఇవ్వాలని నేను ప్రార్థిస్తున్నాను. కోల్పోయిన ప్రతి ఆత్మ వారి శాంతిని పొందాలి “ అని ముకుందన్ తెలిపారు.

ఉన్నిముకుందన్ తన బాల్యం నుండి 24 సంవత్సరాల వయస్సు వరకు, తాను అహ్మదాబాద్‌లోని మణినగర్‌లో తన జీవితాన్ని గడిపానని ముకుందన్ ఇంటర్వ్యూలో తెలిపాడు. ఇది 242 మంది ప్రయాణికులతో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన ప్రదేశానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంది.

అహ్మదాబాద్ నుండి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం మధ్యాహ్నం 1.39 గంటలకు టేకాఫ్ తీసుకుని నిమిషాల్లోనే కుప్పకూలింది. ఇందులోని విమాన సిబ్బందితో సహా కనీసం 241 మంది మరణించారు. ఒకరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఇందులోని 230 మంది ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటీష్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్, ఒక కెనడియన్ ఉన్నారని ఎయిరిండియా

తెలిపింది. చనిపోయిన ప్రయాణీకుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి పరిహారం కూడా ప్రకటించింది.

గతేడాది.. ఉన్ని ముకుందన్ హీరోగా నటించిన మార్కో సినిమా బ్లాక్ బాస్టర్ హిట్ అయ్యింది. ఈ సినిమాకి మలయాళ ప్రముఖ డైరెక్టర్ హనీఫ్ అదేని దర్శకత్వం వహించగా స్టార్ ప్రొడ్యూసర్ క్యూబ్స్ షరీఫ్ మహమ్మద్ నిర్మించాడు. మార్కో సినిమా రూ.30కోట్ల బడ్జెట్ తో నిర్మించగా దాదాపుగా రూ.100 కోట్లు పైగా కలెక్ట్ చేసింది. మలయాళ ఇండస్ట్రీలో అత్యధిక కలెక్షన్లు సాధించిన 6వ సినిమాగా రికార్డులు క్రియేట్ చేసింది. తెలుగులో రిలీజై కూడా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని మంచి వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం సోనీ లివ్ లో స్ట్రీమింగ్ అవుతోంది.

## జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం

జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం , 2న రథోత్సవం జరగనున్నట్లు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా జరుగుతునట్లే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా కళ్యాణం జరుగుతుందని అన్నారు... కల్యాణినికి రాష్ట్ర నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షలో భక్తులు వస్తారు.. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగాకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి , వాటర్ వర్క్స్ , విద్యుత్ , పోలీస్ , ఫైర్ , అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కేతినేని సరళ , ఆలయ ఈవో కృష్ణ , సూపరింటెండెంట్ హైమావతి , ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లాను పరామర్శించిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో దవాఖానలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిను భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. పల్లా రాజేశ్వర్ తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం బాగానే కోలుకుంటున్నట్లు పల్లా రాజేశ్వర్ తెలిపారు. పల్లా రాజేశ్వర్ వేగంగా కోలుకుని, త్వరలోనే తిరిగి ప్రజాక్షేత్రంలో యథావిధిగా కార్యక్రమాల్లో పాల్గొనాలని కేటీర్ ఆకాంక్షించారు. కేటీఆర్ వెంట మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు

## మలక్పేట్ ఇన్స్పెక్టర్ నరేష్, ఎస్ఐ నవీన్ ల పై ఏసీపీ కి ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు

**హైదరాబాద్ పెన్ పవర్:** మలక్పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని నమోదైన కేసుల పై నిర్లక్ష్యం వహిస్తున్న ఇన్స్పెక్టర్ నరేష్, ఎస్ఐ నవీన్ ల పై బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ మాలక్పేట్ ఏసీపీ సుబ్బిరామ రెడ్డికి ఫిర్యాదు చేశారు. గతంలో ఓ ఆక్సిడెంట్ కేసులో నిర్లక్ష్యం వహించడమే కాకుండా ఇచ్చిన ఫిర్యాదు లేదని చెప్పాడని ఆవేదన చెందారు. నిన్న జరిగిన అక్రమ నిర్మాణం పై పలు మార్లు అపార్మెంట్ వాసులు ఎస్ ఐ నవీన్ కు ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యం వహించాడని, ముందుగానే పట్టించుకుంటే బహ్మానందం పై దాడి జరిగేది కాదని తెలిపారు. అపార్మెంట్ దాడి కేసులో నలుగురు ని అరెస్టు చేశారు... కానీ అపార్మెంట్ లో అక్రమ భవనం నిర్మాణానికి పునుకున్న బిల్డర్ మసియుద్దీన్ పై కేసు నమోదు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు


## ఎంఐఎం ఎమ్మెల్యే అనుచరులపై తిరగబడి దాడి చేసిన స్థానికులు.

**హైదరాబాద్ పెన్ పవర్:** యాకుత్పుర పరిధిలో నాలా సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని నాంపల్లి ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ను స్థానికులు నిలదీసారు.వానాకాలం వచ్చినా కూడా నాలా పనులు చేయడంలేదని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే అనుచరులను చితక బాదారు.

## పేర్ని నానికి మతిభ్రమించింది

**హైదరాబాద్ పెన్ పవర్:** పేర్ని నాని నకిలీ పట్టాల వ్యవహారంలో మంత్రి కొల్లు రవీంద్ర మీడియా సమావేశం నిర్వహించారు. అరెస్ట్ భయంతో పిచ్చి పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతున్నాడు. చరిత్రలో చూశాం.. అవాకులు చవాకులు పేలిన అనేక మంది కాలగర్భంలో కలిసిపోయారు. తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బురదజల్లే కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. ఎన్నికల్లో తన కొడుకుని గెలిపిచుకోవడం కోసం పడరానిపాట్లు పడి, చేయరాని తప్పులు చేశారు. దొంగ పట్టాలు సృష్టించి అమాయక పేద ప్రజలకు పంచి పెట్టి మోసం చేశారని అన్నారు. ఆ నాడు తహశీల్దార్ కార్యాలయంలో అర్ధరాత్రి పూట దొంగ పట్టాలు తయారు చేయడాన్ని మేం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నాం. ట్రీట్ ఫీల్డ్ పేరుతో పట్టాలు ఇచ్చి పేదలను మోసం చేశావ్. నాడు నువ్వు ఇచ్చిన దొంగ పట్టాలపై విచారణ జరుగుతుంటే గజ గజ వణికిపోతున్నావ్. తండ్రీ కొడుకులు ఇద్దరూ పారిపోయి హైకోర్టుకు వెళ్లి ముందస్తు బెయిల్ పిటీషన్ కు పిటీషన్ వేశావ్. ఎన్నికల కోడ్ వచ్చే వరకు తహశీల్దార్ గా సునీల్ ఉన్నాడని చెబుతున్నావ్.. ఎక్కడ ఉన్నాడో చెప్పు. కోడ్ వచ్చిన సమయంలో సునీల్ అనపర్తిలో ఉన్నాడు. నీకు నీ భార్య మీద అంత ప్రేమ ఉంటే పేదల బియ్యం బొక్కేవాడివా..? నీ గోడౌన్ నుండి కాకినాడ పోర్టుకు వెళ్లిన ప్రతి లారీ సీసీ ఫుటేజ్ టోల్ గేట్ల దగ్గర సీసీ కెమెరాలలో రికార్డ్ అయ్యాయి. న్యాయాధికారి ఆదేశాలతోనే నీ భార్యను విచారించారని అన్నారు. ప్రెస్ మీట్ లు పెట్టి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్న నిన్ను చూసి రాష్ట్ర ప్రజలంతా ఒక బఫూన్ లా చూస్తున్నారు. నీలాంటి వాళ్లు రాజకీయాల్లో అనర్హుడివి.. నీపై అనర్హత వేటు వేయాలి. గతంలో 6400 టిడ్కో ఇళ్లు కడితే పేదలు ఇవ్వడానికి మీకు ఎందుకు మనసు రాలేదు. ఇళ్ల స్థలాల పేరుతో భూములు కొని కమిషన్లు కొట్టుకున్న వ్యక్తి పేర్ని నాని. గ్రామాల్లో స్మశానాలను సైతం కాజేశారు. మెడికల్ కాలేజ్ భూముల కొనుగోళ్లలో అవినీతి జరిగిందని కాగ్ మొట్టికాయలు వేయడం నిజం కాదా..? గిలకలదిండిలో సీఆర్జెడ్ భూములు ఇస్తే పట్టాలు రావని ఆ నాడు పోరాడం. కలెక్టర్ ని కోర్టు భూములు ఎక్కే పరిస్థితి తీసుకొచ్చావ్. ఆ నాడు నేను చేసిన పోరాట ఫలితంగానే నువ్వు అక్కడి పేదలకు భూములు కొని ఇచ్చారు. ఆ భూముల కొనుగోళ్లలోనూ కమిషన్లు కొట్టుకున్నారు. బందరుకోటలో గతంలో నువ్వు ఇచ్చిన దేవనబోయిన రాము భూములకు ఇప్పటికీ పట్టాలు రాని పరిస్థితి. బందరు పోర్టును నేనే కట్టా.. నేనే కట్టా అంటున్నావ్. ఆనాడు మేం చేసిన ఉద్యమ ఫలితమే బందరు పోర్టు. 2006లో బందరు పోర్టును రాజశేఖరరెడ్డి గోగులేరుకు తరలిస్తే నాకు అభ్యంతరం లేదని సంతకం పెట్టిన వ్యక్తివి నువ్వు. ఆ తర్వాత మేం చేసిన ప్రజా ఉద్యమానికి దిగి వచ్చి మా అమ్మ మీద ఒట్టు.. పెదపట్నంలోనే పోర్టు అన్న వ్యక్తివి కూడా నువ్వే. 2014 ఎన్నికల్లో పోర్టు పనులు ప్రారంభించకపోతే కోనేరుసెంటర్ లో మోకాళ్లపై నిలబడి ముక్కును నేలకు రాసి రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న వ్యక్తి నువ్వు కాదా..? పిచ్చి పిచ్చి వాగుడు వాగిన వ్యక్తి పేర్ని నాని. 2014లో మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ పర్చేజింగ్, భూసేకరణ పాలసీల కింద భూములు సేకరించాం. భూముల సేకరణలో అనేక ఇబ్బందులు పెట్టావ్. రెండు సార్లు జగన్ ని తీసుకొచ్చి భూములు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశావ్. వీటన్నింటినీ అధిగమించి పోర్టు పనులు ప్రారంభిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన మీరు ఆ పనులు ఆపివేశారు. అప్పటి ఎంపీ బాలశౌరి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి కొంత నిధులు తెస్తే ఎన్నికల ముందు పోర్టు పనులు ప్రారంభించారు. నేడు ఆ పనులను 67% మేం పూర్తి చేశాం. 2026 జూన్ తర్వాత పోర్టును ఆపరేషన్ లోకితీసుకువస్తామని అన్నారు.

# పూరీ జగన్నాథుడి జెండా ఎత్తుకెళ్లిన గద్ద.. వరస విషాదాలు నాటి హెచ్చరికనా.. విమాన ప్రమాదం దేనికి సంకేతమా..?




**హైదరాబాద్ పెన్ పవర్:**గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ లో విమానం ప్రమాదం.. వందల మంది చనిపోయారు.. ఇదే కాదు.. రెండు నెలలుగా దేశంలో ఎన్నెన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటన్నింటికీ రెండు నెలల క్రితమే దేవుడు సంకేతం ఇచ్చాడు.. ఘోరమైన విషాధాలు జరుగుతాయని దేవుడి సూచించాడా.. అవును ఇప్పుడు ఇదే దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. ముఖ్యంగా ఒడిశా రాష్ట్రంలో ప్రతి ఒక్కరి నోట ఇదే వినిపిస్తుంది.. ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా ఈ విషయాన్నే చర్చించుకుంటున్నారు. కారణం ఏంటీ.. అప్పుడు ఏం జరిగిందో చూద్దాం..

జగన్నాథ ఆలయంపై పక్షులు ఎగరవు. ఆలయంపైకి పక్షులు వెళ్లవు. పక్షులు ఎందుకు అక్కడ ఎగరవు అనే విషయం ఎవ్వరికీ అంతుచిక్కని ప్రశ్న. ఎంతో మంది దీనిపై అధ్యయనం చేసినా కనుక్కోలేకపోయారు. ఇలాంటి విశిష్ఠత ఉన్న జగన్నాథుని ఆలయం గరుడ పక్షి.. గద్ద ఎగిరింది. ఆలయం గోపురం గద్ద వాలింది. అంతే కాదు.. గోపురంపై ఎంతో విశిష్ఠతగా చూసే జెండాను తెంపుకుని వెళ్లింది గద్ద. ఆలయంపై పక్షులే ఎగరవు.. అలాంటిది.. 2025, ఏప్రిల్ 13వ తేదీన ఓ గద్ద.. గోపురంపై జెండా ఎత్తుకెళ్లింది. అప్పట్లోనే ఇది పెద్ద సంచలనం అయ్యింది. ఎంతో మంది పండితులు దీన్ని అపశకునంగా భావించారు. మరికొందరు దీన్ని కొట్టిపారేశారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా జరుగుతున్న వరస ఘటనలతో.. ఇప్పుడు విమాన ప్రమాదంతో ఇది పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయ్యింది. 2025, ఏప్రిల్ 13వ తేదీన పూరీ జగన్నాథుని ఆలయంపై గద్ద ఎగరటం.. గోపురంపై జెండాను ఎత్తుకెళ్లటం అనేది అపశకునంగా భావించటానికి ఇప్పటి ఉదాహరణలే సాక్ష్యం అంటున్నారు ఒడిశా జనం. ఆ తర్వాతనే కదా పహల్గాం దాడి జరిగింది.. పాకిస్తాన్ దేశంతో వివాదం వచ్చింది.. ఆ తర్వాతనే కదా బెంగళూరులో తొక్కిసలాట జరిగిన క్రికెట్ అభిమానులు చనిపోయింది.. ఆ తర్వాతనే ముంబైలో రైలు ప్రమాదం.. ఇప్పుడు విమాన ప్రమాదం.. ఇవన్నీ విపత్తులు కాదా.. పూరీ జగన్నాథుని సంకేతం కాదా అంటున్నారు. పూరీ జగన్నాథుని ఆలయంపై ఎగిరే జెండాకు ఎంతో విశిష్ఠత ఉంది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు జెండాను మారుస్తారు. ఆలయం శిఖరంపై ఎగురుతున్న ఈ జెండాను భక్తులు దర్శనానికి వెళ్లే ముందు చూసి నమస్కరించడం ఆనవాయితీ. ఈ జెండాను గాలికి వ్యతిరేక దిశలో ఎగురవేస్తారు, ఇది ఒక రహస్యం. ఇక్కడ రెండు అంశాలు. ఒకటి గోపురంపై పక్షులు ఎగరవు.. వాలవు.. అలాంటిది గద్ద వచ్చింది.. గోపురంపై జెండాను లాక్కుని వెళ్లింది. ఇలా జరిగితే అది రాబోయే విపత్తులకు సంకేతం.. జరగబోయే ఘోరాలకు సూచికగా భావిస్తారు ఒడిశా జనం.. ఇప్పుడు జరిగిన విమాన ప్రమాదం ఒక్కటే కాదు.. విమాన ప్రమాదం జరిగిన రోజే.. పూరీ జగన్నాథుని ఆలయ పూజారి కూడా హత్యకు గురవ్వటం అనేది చాలా పెద్ద అంశంగా.. తీవ్రమైనదిగా భావిస్తున్నారు ఒడిశా జనం. దేశంలో వరసగా జరుగుతున్న ప్రమాదాలు, విషాదాలు, విపత్తులకు కారణం పూరీ జగన్నాథుని ఆలయంపై జెండాను గద్ద ఎత్తుకెళ్లటమే అని.. ఇది దేవుడి సంకేతం అని అంటున్నారు. సోషల్ మీడియాలోనూ దీనిపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తుంది.

# బ్లాక్ బాక్స్ దొరికింది.. ఇదే ప్రమాదానికి కారణం తెలిపే కీలక ఆధారం

**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఘటనలో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం(జూన్13) అహ్మదాబాద్‌లో కూలిపోయిన విమానం బ్లాక్ బాక్స్ దొరికింది. విమానం కూలిన మెడికల్ కాలేజీ హాస్టల్ బిల్డింగ్?పై దర్యాప్తులో పాల్గొన్న ATSఅధికారులకు బ్లాక్ బాక్స్ లభ్యమైంది. ఇదే విమాన ప్రమదానికి కారణం తెలిపే కీలక ఆధారం కానుంది. ఇంతకుముందు కూలిపోయిన ఎయిర్ ఇండియా విమానశకలాలనుంచి డిజిటల్ వీడియో రికార్డర్ ను స్వాధీనం చేసుకున్నారు దర్యాప్తు అధికారులు. ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్ లైనర్ కూలిపోయిన బీజే ఆస్పత్రి సమపీంలో దర్యాప్తులో పాల్గొన్న ATS అధికారి డీవీఆర్ ను కనుగొన్నారు. బ్లాక్ బాక్సు, డీవీఆర్ లభ్యం కావడంతో దర్యాప్తు మరింత వేగవంతం కానుంది. ఎయిరిండియా బోయింగ్ 787%-%8 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాదంలో బ్లాక్ బాక్స్ కీలకం. పైలట్ల సమాచారం,




విమానం టెక్నికల్ సమాచారం అంతా బ్లాక్ బాక్స్ లోనే రికార్డు కావడంతో తదుపరి దర్యాప్తులో బ్లాక్ బాక్సుల పాత్ర కీలకంగా మారింది.మరోవైపు అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతుల సంఖ్య 297 కు పెరిగింది. విమానంలో ఉన్న 242 మందిలో 241 మంది మృతిచెందగా.. ఈ విషాదం నుంచి ఒకే ఒక్కడు బయటపడ్డాడు. మృతుల్లో 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. విమానం మెడికల్ కాలేజీ హాస్టల్ పై కూలడంతో ఆ సమయంలో అక్కడ ఉన్న 56 మంది మృతిచెందారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిన ఘటన స్థలాన్ని శుక్రవారం ప్రధాని మోదీ సందర్శించారు. మేఘని నగర్ లో ప్రమాద స్థలంలో జరుగుతున్న సహాయక చర్యలు అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

హోంమంత్రి అమిత్ షా కూడా గురువారం సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. మరోవైపు ప్రమాదంపై దర్యాప్తు వేగవంతం చేశారు అధికారులు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం జాతీయ దర్యాప్తు సంస్థ ( బృందం ప్రమాద స్థలానికి చేరుకుంది.

# ఏఐజీ ఆసుపత్రిలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు

- మొదటి పేజీ తరువాయి

కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల కోసం ఆయన మధ్యాహ్నం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

# మా సామాజికవర్గంలో నేను ఒక్కడినే ఉన్నా... మంత్రి పదవి ఇవ్వండి

- మొదటి పేజీ తరువాయి

శాసనసభలో నేను ఒక్కడినే ప్రాతినిధ్యం వహిస్తున్నాను" అని తెలిపారు. తమ సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని కోరారు. తమ డిమాండ్ల గురించి వివరిస్తూ, "గొల్ల, కుర్మలకు ఒక మంత్రి పదవి, ఒక ప్రభుత్వ సలహాదారు పదవి, ఒక ఎమ్మెల్సీ, ఐదు నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవులు, ఐదు కమిషన్ సభ్యుల పదవులు, పార్టీలో ఒక వర్కింగ్ ప్రెసిడెంట్, మూడు వైస్ ప్రెసిడెంట్ పదవులు, ఎనిమిది ప్రధాన కార్యదర్శి పదవులు, ఐదు డీసీసీ అధ్యక్ష పదవులు కేటాయించాలి" అని బీర్ల ఐలయ్య విజ్ఞప్తి చేశారు. చరిత్రలో ఎన్నడూ గొల్ల, కుర్మలు లేకుండా రాష్ట్ర కేబినెట్ ఏర్పడలేదని, ఈసారి కూడా తమకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా త్వరలో కలిసి విన్నవిస్తామని ఐలయ్య తెలిపారు. "సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంలో బీసీలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం మాకుంది. అయితే, గొల్ల, కుర్మలకు కూడా ప్రత్యేకంగా అవకాశాలు కల్పించాలి. మా డిమాండ్లపై ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, విద్య, రాజకీయ, ఉపాధి అవకాశాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని బీర్ల ఐలయ్య ప్రశంసించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

- మొదటి పేజీ తరువాయి

విచారణ జరిగింది. తొమ్మిదేళ్ల క్రితం గోపన్‌పల్లిలోని వివాదాస్పద భూమిలో ఉన్న సొసైటీ గదిని జేసీబీతో కూల్చివేశారని, కులం పేరుతో దూషించారని రేవంత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మణ్‌పై పెద్దిరాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

దీనిపై అప్పట్లో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై పెద్దిరాజుకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

# పారామిలిటరీ బలగాల్లో అత్యుత్తమం సీఆర్పీఎఫ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉగ్రవాద మావోయిస్టుల నిర్మూలనలో సీఆర్పీఎఫ్ పాత్ర కీలకం. అత్యాధునిక ఆయుధాలను అందిస్తాం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. జంషెడ్ పూర్ లో సీఆర్పీఎఫ్ నూతన భవనాలను ప్రారంభించిన బండి సంజయ్ జమ్మూ కాశ్మీర్ సహా దేశంలోని ఉగ్రవాదం, వేర్పాటువాదం ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాదంతోపాటు మావోయిస్టుల ఏరివేతలో సీఆర్పీఎఫ్ బలగాలు చూపుతున్న తెగువ అద్భుతమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశంలోని అంతర్గత శాంతి భద్రతలను పరిరక్షించడంలో సీఆర్పీఎఫ్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. దేశ అంతర్గత భద్రత విషయంలో సీఆర్పీఎఫ్ బలగాల త్యాగాలను వెలకట్టలేనివని అభివర్ణించారు. రాంచిలోని బిర్సాముండా విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అక్కడి నుండి బిఎస్ఎఫ్, హెలికాప్టర్ ఎం ఐ 17, లో జంషేడ్ పూర్ వెళ్లారు. విప్లవ వీరుడు బిర్సా ముండా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుండి సీఆర్పీఎఫ్ కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్ నూతనంగా నిర్మించిన పలు సీఆర్పీఎఫ్ భవనాలను ప్రారంభించారు. అందులో 480 టైప్-2 మరియు 24 టైప్-3 కుటుంబ నివాస గృహాలు, 20 పడకల ఆసుపత్రి, స్టోర్ బిల్డింగ్, ట్రేడ్స్‌మెన్ షాప్, 180 మందికి గల మెన్ బ్యారక్ లు ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎంపీ విద్యుత్ బరణ్ మహతో అదనపు డీజీ అమిత్ కుమార్, ఐపీఎస్ అధికారులు శాలినీ, సాకేత్ కుమార్ తోపాటు పలువురు పోలీసు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైనవారికి సంతాపం తెలుపుతూ 2 నిమిషాలు మౌనం పాటించారు.

సిఆర్.పీ.ఎఫ్. జవాన్లు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశ భద్రత కోసం, ప్రత్యేకించి తీవ్రమైన దుర్భర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ మాతృభూమికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. వారి సేవలను దృష్టిలో ఉంచుకుని జవాన్లకు, అధికారులకు వారి కుటుంబాలతో నివసించేందుకు వీలుగా గృహ నిర్మాణాల్ని నిర్మిస్తున్నాం. ఈ గ్రహ నిర్మాణాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. అందులో భాగంగానే జంషేడ్ పూర్ లోని సీఆర్పీఎఫ్ గ్రూప్ కేంద్రంలో 165 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన 480 టైప్-2, 24 టైప్-3 కుటుంబ ఆవాసాలతోపాటు భండార్ భవనం, ట్రేడ్స్‌మెన్ షాప్, 20 బెడ్ల ఆసుపత్రి, అధికారుల మెస్, 180 మందికి సరిపడా మెయిన్ బ్యారక్ లను నిర్మించడంతోపాటు నా చేతుల ద్వారా వాటిని ప్రారంభించడాన్ని గర్వంగా భావిస్తున్నాను. విధుల్లో ఉన్న సీఆర్పీఎఫ్ జవాన్లు, అధికారులు తమ కుటుంబాలను సురక్షిత వాతావరణంలో ఉంచి, పిల్లలకు మంచి విద్య అందించడంలో వీలు కల్పించి, ఎటువంటి ఆందోళన లేకుండా దేశ సేవలో మునిగిపోవడానికి ఈ రెసిడెన్షియల్ క్వార్టర్స్ ఎంతగానో ఉపయోగపడతాయి.

# సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో పోస్టింగ్ లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో వారి సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ ప్రక్రియకు సంబంధించి గురువారం జారీచేసిన మార్గదర్శకాల్లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2025 మే 31 నాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారికి బదిలీ తప్పనిసరి. స్థానచలనం కల్పించిన ఉద్యోగుల వివరాలు హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో జులై 10లోగా అప్‌లోడ్ చేయాలి.

బదిలీల తరువాత సచివాలయాల్లో నిర్దేశించిన దానికంటే అధికంగా ఉన్న ఉద్యోగులు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా చోట్లే కొనసాగనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం కలెక్టర్లకే పూర్తి అధికారాలు కల్పించింది. ఈ నెల 30లోగా ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించింది. బదిలీల్లో వీరికి ప్రాధాన్యం అంధులు. మానసిక వికలాంగులైన పిల్లల తల్లిదండ్రులు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకుపైగా పనిచేసిన వారు. 40 శాతానికి పైగా అంగవైకల్యం ఉన్నవారు. క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి సమస్యలు ఉన్నవారు.

కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన వారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లో వారిని నియమించాలి. వీరందరివీ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లుగా పరిగణించి ప్రయాణ భత్యాలు వర్తింపజేయాలి.


ఐటీడీఏల్లో మొదట ఖాళీలు నింపాలి.

అంతర్గత, వెనుకబడిన ప్రాంతాల్లో ఖాళీల భర్తీకి ప్రాధాన్యమివ్వాలి.

ఐటీడీఏ ప్రాంతాల నుంచి బదిలీ అయిన వారి స్థానంలోకి వేరొకరు వచ్చి చేరాకే రిలీవ్ చేయాలి. హేతుబద్ధీకరణ, బదిలీలు ఒకేసారి.. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలను ప్రభుత్వం ఒకేసారి చేపట్టింది. హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవోలు (నంబర్లు 1, 3, 4) అనుసరించి బదిలీలు చేయాలని కలెక్టర్లకు సూచించింది. జనాభా పరంగా సచివాలయాలను ప్రభుత్వం పలు కేటగిరీలుగా విభజించింది. 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు, 'బీ'లో ఏడుగురు, 'సీ'లో ఎనిమిది మంది ఉద్యోగులను ఉంచాలని నిర్ణయించింది. వీరిని స్పెసిఫిక్ పర్పస్ (టెక్నికల్), జనరల్ పర్పస్ ఫంక్షనరీలుగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను బదిలీల్లో కలెక్టర్లు పాటించనున్నారు. డిప్యుటేషన్లపై మిగులు ఉద్యోగులు హేతుబద్ధీకరణ, బదిలీల ప్రక్రియ పూర్తయ్యాక సచివాలయాల్లో మిగులు ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలకు డిప్యుటేషన్లపై పంపనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల నుంచి 15 వేల మంది మిగులు ఉద్యోగులు ఉంటారని అంచనా. వీరందర్నీ ప్రస్తుతానికి అవే సచివాలయాల్లో కొనసాగిస్తారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో అవసరాల మేరకు వీరిని దశలవారీగా డిప్యుటేషన్లపై పంపాలని నిర్ణయించారు. గత వైకాపా ప్రభుత్వం ఒక్కో సచివాలయంలో 8 నుంచి 12 మంది ఉద్యోగులను నియమించింది. హేతుబద్ధీకరణలో ఆ సంఖ్యను 6 నుంచి 8కి కూటమి ప్రభుత్వం తగ్గించింది. మరోవైపు సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వరాదన్న నిబంధనను తొలగించాలని ఆయా ఉద్యోగ సంఘాల నేతలు వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తున్న లోకేష్

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే విధంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులకు మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు (వాసు) చెప్పారు. సిటిలో అప్ గ్రేడ్ అయిన అన్నపూర్ణమ్మపేట సీనియర్ నేషనల్ బేసిక్ స్కూల్, వి ఎల్ పురం శ్యామలాంబ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్, మోరంపూడి స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ ను శుక్రవారం ఉదయం ఆయన పంపిణీ చేసారు. ఆయా పాఠశాలల్లో అప్ గ్రేడ్ చేసిన తరగతి గదులను ప్రారంభించి ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రయివేటు పాఠశాలల్లో సీట్లకు సిఫార్సు లేఖల కోసం తల్లిదండ్రులు వస్తూ ఉంటారని గుర్తుచేసారు. అయితే వచ్చే రెండు మూడేళ్ళలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సీటు కోసం సిఫార్సు చేయమని తమ దగ్గరకు లేఖల కోసం వచ్చేలా విద్యావ్యవస్థలో మార్పులు రాబోతున్నాయని అన్నారు. ఆ దిశగా మంత్రి లోకేష్ మార్పులు తెస్తున్నారని ఆయన అన్నారు. గతంలో ఇచ్చిన విద్యాకిట్లకు ఇప్పటికీ ఎంతో తేడా ఉందని ఎమ్మెల్యే వాసు చెబుతూ, గతంలో జగనన్న బొమ్మలు ఉండేవని, ఇప్పుడు పాలకుల బొమ్మలు కాకుండా రాష్ట్రపతిగా చేసిన ఉపాధ్యాయుడైన డా సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతొ ఆయన బొమ్మ వేసి కిట్లు ఇప్పుడు ఇస్తున్నామని అన్నారు. గతంలో యూనిఫారంలు, బ్యాగులు ఏమాత్రం నాణ్యత లేకుండా ఉండేవని, ఇప్పుడు అత్యంత నాణ్యత గల బ్యాగులు, యూనిఫారంలు ఇస్తున్నామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇక ఇప్పటివరకు పాఠశాల స్థాయిలోనే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం ఉంటేనే బాగా చదువుతారని భావించి జూనియర్ కాలేజీల్లో కూడా మధ్యాహ్నం భోజన పథకం మంత్రి లోకేష్ ప్రవేశపెట్టినట్లు ఆయన చెప్పారు. గతంలో జగనన్న గోరుముద్ద వంటి పేర్లతో పథకాలు పెడితే, కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతొ మధ్యాహ్నం భోజన పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే వాసు హర్షద్వానాల మధ్య చెప్పారు. డొక్కా సీతమ్మ ఓపిక ఉన్నంతకాలం ఎవరు ఆకలితో వచ్చిన లేదనకుండా కాదనకుండా కడుపునిండా భోజనం పెట్టి పంపించిన డొక్కా సీతమ్మ దాతృత్వాన్ని గుర్తించి ఆనాటి బ్రిటిషు ప్రభుత్వం ప్రశంసించిందని అటువంటి మహనీయురాలి గురించి విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశ్యంతో ఈ పేరు పెట్టినట్లు ఆయన చెబుతూ ఇదీ కూటమి ప్రభుత్వ విశాలమైన ఆలోచనకు నిదర్శనమన్నారు. అలాగే సిటిలోని సీనియర్ నేషనల్ బేసిక్ స్కూల్, శ్యామలాంబ స్కూల్, మోరం పూడి స్కూల్స్ లో 8వ తరగతి వరకు మాత్రమే ఉండగా, తల్లిదండ్రుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని హైస్కూల్స్ గా మార్చాలని ప్రతిపాదన పంపిన వెంటనే ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వివరించారు. ఇక ఇన్నాళ్లూ భయపడుతూ వస్తున్న బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ ల పని కూడా పడుతున్నామని, ఇప్పటికే చాలామందిని గుర్తించామని, ఇంకా ఎవరైనా ఉంటె తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు చేపడతామని, భయం లేకుండా స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన చెప్పారు. ఏవైనా తేడా వస్తే గతంలో ప్రశ్నించడానికి భయపడే పరిస్థితులు ఉండేవని ఇప్పుడు అలాంటిదేమీ ఉండదని, ఏ సమస్య వచ్చినా మీ శాసనసభ్యునిగా నేను ఉన్నానని అలాగే పైన ఒక పక్క ముఖ్యమంత్రి చందరాబు, మరోపక్క డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇంకోపక్క మంత్రి లోకేష్ కూడా ప్రజల కోసమే అనుక్షణం ఆలోచిస్తూ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జి రాంబాబు, మాలే విజయలక్ష్మి, చింతా జోగినాయుడు, పోలాకి పరమేష్, సనపతి సత్తిబాబు, కిలపర్తి నాగభూషణం, దాస్యం ప్రసాద్, బోను ఈశ్వరి, ఆదారి లక్ష్మీ నారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## రేవంత్ క్వాష్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ మరోసారి వాయిదా

**హైదరాబాద్ పెన్ పవర్:** తనపై నమోదు అయిన భూవివాదం కేసును క్వాష్ చేయాలని గతంలో రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. శేరిలింగంపల్లిలోని గోపన్ పల్లిలో భూవివాదానికి సంబంధించిన కేసు వ్యవహారంలో ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై హైకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం విచారణకు ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది. గోపన్ పల్లిలోని సర్వే నెంబర్ 127కు సంబంధించి రేవంత్ రెడ్డిపై 2016లోనే గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. చార్జీషీట్ కూడా దాఖలు చేశారు. ఈ భూవివాదంలో రేవంత్ రెడ్డి హస్తం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో రేవంత్ , ఆయన సోదరుడు కొండల్ రెడ్డితోపాటు లక్ష్మయ్య అనే వ్యక్తిని చేర్చారు. అయితే, ఇదంతా రేవంత్ పై కక్షపూరితంగా కేసు నమోదు చేశారని ఆరోపణలు కూడా ఉన్నాయి. అప్పటి నుంచి ఈ కేసుపై విచారణ జరుగుతోంది. దీంతో ఈ కేసును క్వాష్ చేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం మరోసారి విచారణ చేపట్టిన కోర్టు విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది

# మా పురోగతిలో భాగస్వామ్యం అవ్వండి

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలో ఇతర రాష్ట్రాలకు సంక్షేమం, అభివృద్ధిలో రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పలు దేశాల ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం బంజారాహిల్స్ తాజ్ డెక్కన్ హెూటల్ లో 'ఇంటర్నేషనల్ బిజినెస్ కొలాబరేషన్(ఐబీసీ)' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్ %-% 2025'ను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ' మొదట్లో చాలా మంది తెలంగాణ ఏర్పాటు అసాధ్యమన్నారు. కానీ.. ఆనతి కాలంలోనే తెలంగాణ అన్ స్టాపబుల్ అనే స్థాయికి ఎదిగింది. రాష్ట్ర జీడీపీ ?16.12 లక్షల కోట్లకు చేరింది. 10.1 శాతం వృద్ధి రేటుతో దేశ సగటు (9.9%)ను దాటేసింది. తలసరి ఆదాయం ?3.79 లక్షలు. ఇది దేశ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ. ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సేకరించగలిగాం. గత 14 నెలల్లో లైఫ్ సైన్సెస్ లో రూ. 40వేల కోట్ల పెట్టుబడులను సాధించాం. 2 లక్షల ఉద్యోగాలు సృష్టించాం. రాష్ట్ర జీడీపీలో సేవల రంగం వాటా 66.3 శాతం. దేశంలో ఇది 55 శాతంగా ఉంది. ఇవి అంకెలు కాదు... తెలంగాణ పురోగతికి నిదర్శనాలు' అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'ప్రతి భాగస్వామ్యం ఒక లావాదేవీ కాదు... అది ఒక మార్పు. అందుకే అంతర్జాతీయ భాగస్వామ్యాలతో తెలంగాణ పురోగతిని మరో అడుగు ముందుకు తీసుకెళ్లాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆగ్రో ఇన్నోవేషన్, ఏఐ గవర్నెన్స్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, డిజిటల్ ఫార్మింగ్, ఫ్యూచర్ %-% రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మానుఫ్యాక్చరింగ్, క్లీన్ ఎనర్జీ తదితర అంశాల్లో ప్రపంచ దేశాలతో పని చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. 'మిగిలిన రాష్ట్రాలు ట్రెండ్ను అనుసరిస్తే... తెలంగాణ దాన్ని సృష్టిస్తుంది. అందుకే కేవలం ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు మాత్రమే రావొద్దు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు కలిసి రండి' అని పిలుపునిచ్చారు. 'బ్రెజిల్, జర్మనీ, రష్యా, కామెరూన్, మాల్టా, యూకే, బల్గరేయా, బెల్జియం, యూఏఈ, దుబాయి తదితర 25 దేశాల ప్రతినిధులు ఒకే వేదిక పైకి రావడం శుభపరిణామం. ఇది ఒక సదస్సుగా మిగిలిపోకుండా వివిధ దేశాల మధ్య సంస్కృతి, వ్యూహాలు, టెక్నాలజీ బదలాయింపునకు వారధిగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సహాకాలను మీ దేశంలోని పారిశ్రామికవేత్తలకు వివరించండి. ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించండి' అని కోరారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ డిప్లోమేటిక్ రిలేషన్స్(ఐవోడీఆర్) మాల్టా గవర్నర్ లిల్లో మర్రా, కార్యదర్శి మార్సెల్లో పట్టి, బెల్జియం ఎంపీ ఇవాన్ పెట్రోవ్, జర్మనీ డిప్లొమాట్ డానియల్ జెర్బిన్, అర్జెంటీనా ఎంపీ క్లాడియో సింగోలనీ, ఐబీసీ ఛైర్మన్ సాల్మన్ గట్టు, డైరెక్టర్ గ్లోరియా సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో తప్పిన ఘోర విమాన ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం తప్పింది. బోస్టన్ లోని లోగాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రన్‌వేపై ఓ విమానం అదుపుతప్పింది. రన్‌వే నుంచి జారి పక్కకు దూసుకెళ్లింది. అయితే, పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. జెట్‌బ్లూ సంస్థకు చెందిన 312 విమానం షికాగో నుంచి బోస్టన్‌లోని లోగాన్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చింది. ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై ఒక్కసారిగా అదుపుతప్పింది. రన్‌వే నుంచి జారి పక్కకు దూసుకెళ్లింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించి అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై జెట్‌బ్లూ సంస్థ స్పందించింది. విమానం ల్యాండింగ్ తర్వాత రన్‌వే నుంచి పక్కకు దూసుకెళ్లినట్లు పేర్కొంది. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించింది. కాగా, గురువారం మధ్యాహ్నం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు.

## ఇరాన్‌పై ముందస్తు దాడులు.. విమానం వెనక్కి తిరిగి వచ్చిన ఎయిర్ ఇండియా

**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై నుంచి లండన్ బయల్దేరిన ఓ ఎయిర్ ఇండియా విమానం వెనక్కి తిరిగొచ్చింది. ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. ఎయిర్ ఇండియాకు చెందిన విమానం ఇవాళ తెల్లవారుజామున 5:39 గంటల సమయంలో ముంబై నుంచి లండన్‌కు బయల్దేరింది. దాదాపు మూడు గంటలు ప్రయాణించిన తర్వాత ముంబైకి తిరిగి వచ్చింది. దీనిపై ఎయిర్ ఇండియా స్పందించింది. ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తన గగనతలాన్ని మూసి వేసిన విషయం తెలిసిందే. దీంతో విమానం వెనక్కి తిరిగి వచ్చినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. పలు విమానాలను దారి మళ్లించినట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్‌పై ముందస్తు దాడులకు దిగింది. అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్ అణు స్థావరాలే లక్ష్యంగా దాడి చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. టెహ్రాన్ ప్రతిదాడులు చేసే అవకాశం ఉండటంతో దేశంలో అత్యవసర పరిస్థితులను ప్రకిటించింది. తాజా దాడుల నేపథ్యంలో అప్రమత్తమైన ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. కాగా, గురువారం మధ్యాహ్నం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు

## పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధమేఘాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్‌పై ముందస్తు దాడులకు దిగింది. అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. శుక్రవారం ఉదయం దేశ రాజధానిలో పేలుళ్ల శబ్ధం వినిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారని ఇరాన్ అధికార మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా టెహ్రాన్ సైతం ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు దిగింది. డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ దాడులను ఇజ్రాయెల్ సమర్థవంతంగా తిప్పికొడుతోంది. ఇక ఇజ్రాయెల్ దాడులతో అప్రమత్తమైన ఇరాన్ తన గగనతలాన్ని మూసి వేసిన విషయం తెలిసిందే. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. న్యూయార్క్ నుంచి ఢిల్లీకి, ఢిల్లీ, ముంబై నుంచి లండన్, న్యూయార్క్‌కు వెళ్లే అనేక విమానాలు ప్రభావితమయ్యాయి. పలు విమానాలను దారిమళ్లించగా.. మరికొన్ని వెనక్కి తిరిగివస్తున్నాయి. దాదాపు 16 ఎయిర్ ఇండియా విమానాలను దారి మళ్లించినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది.

# బీఆర్ఎస్ ఎన్నారై విభాగం ఐర్లాండ్ కమిటీ అధ్యక్షునిగా కిరణ్ అనుగుర్తి

**హైదరాబాద్ పెన్ పవర్:**
బీఆర్ఎస్ ఎన్నారై విభాగంలో భాగంగా ఐర్లాండ్ అధికారిక కమిటీని బీఆర్ఎస్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాలా ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఐర్లాండ్ కమిటీ అధ్యక్షునిగా మొట్టమొదటిసారిగా జగిత్యాలకు చెందిన కిరణ్ అనుగుర్తి ఎన్నికయ్యారు. తాజాగా, ఐర్లాండ్ 53వ దేశంగా బీఆర్ఎస్ ఎన్నారై విభాగంలో చేరింది. దీనికి సంబంధించి 2025%-%2027 సంవత్సరాల అధికారిక కమిటీని మహేష్ బిగాల ప్రకటించారు.




తెలంగాణను అభివృద్ధి మార్గంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో కూడిన పరిపాలన ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ప్రేరణగా నిలుస్తోందని అన్నారు. ఇటీవల డల్లాస్‌లో ఘనంగా నిర్వహించిన గ్లోబల్ బీఆర్ఎస్ ఎన్నారై మహాసభల అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కొత్త దేశాల్లో ఎన్నారై కమిటీల ఏర్పాటు కోసం భారీగా అభ్యర్థనలు వస్తున్నాయని మహేష్ బిగాల తెలిపారు.

కమిటీ సభ్యుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అధ్యక్షుడు: కిరణ్ అనుగుర్తి, ఉపాధ్యక్షులు విశాల్ శిరంశెట్టి, నితిష్ చిలువేరి, ప్రధాన కార్యదర్శి పవన్ అనుగుర్తి, సలహా బోర్డు ఛైర్మన్లు అజయ్ పొలంపల్లి, లింగమూర్తి, సలహా బోర్డు వైస్ ఛైర్మన్ ఉమేష్ చిప్ప, సలహా బోర్డు సభ్యులు చాను బోయిని, సూర్య చందన్, నవీన్ కుమార్ కొండిజు, కార్యదర్శులు రాకేష్ లెసాని, అన్వేష్ రెడ్డి, నోమాన్ సయ్యద్, ఐటీ, మీడియా, పీఆర్ కార్యదర్శి సాయి మనీష్ తాటికొండ, ట్రెజరర్ ఉమేష్ చిప్ప, ప్రదీప్ గౌడ్, కమ్యూనిటీ వ్యవహారాల ఛైర్మన్ దినేష్ నంపల్లి, కమ్యూనిటీ వ్యవహారాల ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చిద్రం, అధికార ప్రతినిధులు రామకృష్ణ వేణిరెడ్డి, ఉమేష్ చిప్ప, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లు పవన్ అనుగుర్తి, దిలీప్ రెడ్డి గోపు, సభ్యత్వ కోఆర్డినేటర్ అభినవ్ గడ్డం ను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఐర్లాండ్‌లో బీఆర్ఎస్ సిద్ధాంతాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడమే కాకుండా, స్థానిక కమ్యూనిటీలో తెలంగాణ సంస్కృతి, సేవా కార్యక్రమాలను విస్తృతంగా బలోపేతం చేయనుందని మహేష్ బిగాల తెలిపారు.

# దొంగలు దొంగలు కలిశారు - దొంగ పిర్యాదులు చేశారు

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రజలను, ప్రభుత్వ నిధులను దోచుకున్న దొంగలు అంతా కలిసి తనపై తప్పుడు ఆరోపణలతో దొంగ పిర్యాదులు చేయించారని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన బుగ్గారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విలేఖరులతో మాట్లాడారు. బుగ్గారం గ్రామానికి చెందిన నిరుపేద దళిత వృద్ధుడు నక్క రాజలింగు కు మద్యం త్రాగించి, మాయ మాటలు చెప్పి తప్పుడు, అసత్యపు ఆరోపణలతో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తనపై పిర్యాదు చేయించారని ఆయన వివరించారు. బుగ్గారం గ్రామ పంచాయతీ లో జరిగిన భారీ నిధుల దుర్వినియోగం, భూ కబ్జాలు, అక్రమ కట్టడాలు, ఇతర అవినీతి, అక్రమాలను బయట పెట్టినందుకే కుట్ర పూరితంగా తనపై తప్పుడు ఆరోపణలతో నక్క రాజలింగును పావుగా వాడుకుంటున్నారని అన్నారు. నక్క రాజలింగుకు జరిగిన అన్యాయంపై చట్టబద్ధంగా, భారత రాజ్యాంగ బద్దంగా ధర్మంగా న్యాయ పోరాటం జరుగుతుందని వివరించారు. ఆ పోరాటంలో ఫలించే విజయం ద్వారా నక్క రాజలింగు చేకూరే సుమారు రూ.8,40,000 ఎనిమిది లక్షల నలభై వేల రూపాయల లబ్ధిని చెడగొట్టేందుకే ఈ దోపిడీ దారులు కుట్రలు పన్నారని ఆరోపించారు. ఈ దోపిడీ దొంగల్లోని ఒక వ్యక్తే గతంలో కుట్రతో నక్క రాజలింగు కు చెందిన 14 గుంటల భూమిని అప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డుల్లో తొలగించి ఇతరుల పేరున నమోదు చేయించి రాజకీయంగా

లబ్ధి పొందినట్లు తెలిసిందన్నారు. నేడు కూడా అదే వ్యక్తి నక్క రాజలింగుకు భూమి రికార్డుల్లో నమోదు కాకుండా అడ్డుకునే కుట్రల్లో భాగమే ఈ ఎత్తుగడలు, ఈ తప్పుడు పిర్యాదులు అని పేర్కొన్నారు. నక్క రాజలింగు ఒక్కడే కాకుండా అనేక మంది ఈ దోపిడీ దొంగల అరాచకాల వలన భూమిని రికార్డుల్లో కోల్పోయారని వారందరికీ న్యాయం జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. నిజంగా న్యాయం కోరుకునే వారు ఇలాంటి అసత్యపు ఆరోపణలతో తప్పుడు పిర్యాదులు చేయరని, అస్సలు విషయాలు క్షుణ్ణంగా తెలుసుకుని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు.

త్వరలోనే ఈ దోపిడీ దారుల, దోపిడీ దొంగల నిజ స్వరూపం కూడా బయట పడబోతుందని, వీరివల్ల ఎంతమందికి, ఎంత నష్టం జరిగిందో...

బుగ్గారం గ్రామానికి, గ్రామ ప్రజలకు, పేదలకు, దలితులకు కూడా ఈ దోపిడీ దారుల వలన కలిగిన కష్టాలు, నష్టాలు, నిలిచి పోయిన అభివృద్ధి, వీరు అడ్డుకున్న లబ్ధి, అన్ని వివరాలతో తగిన ఆధారాలతో సహా బయట పెడుతామని చుక్క గంగారెడ్డి తెలిపారు. ప్రజలు అందరినీ, అన్నింటినీ ఎప్పటి కప్పుడు గమనిస్తున్నారని త్వరలోనే ప్రజలే ఈ దోపిడీ దొంగలకు తగిన గుణ పాఠం చెప్పి తీరుతారని చుక్క గంగారెడ్డి హితవు పలికారు.